
ప్రజాశక్తి
ఆదివారం 3 సెప్టెంబర్ 2023
5
విజయనగరం



వాహనాలకు స్పష్టమైన నంబరు ప్లేట్లు ఉండాలి

ప్రజాశక్తి-విజయనగరం

వాహనాలకు అస్తవ్యస్థమైన నంబరు ప్లేట్ ఉంటే చర్యలు తప్పవని ట్రాఫిక్ డిఎస్‌పి డి,విశ్వనాథ్ హెచ్చరించారు. శనివారం నగరంలోని పలుచోట్ల ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఆర్‌టిసి కాంప్లెక్సు, కోట జంక్షన్, దాసన్నపేట రైతు బజారు వద్ద ట్రాఫిక్ ఎస్‌ఐలు లోవరాజు, ఎ.ఎం. రాజు వాహన తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనాలకు గల ఆస్తవ్యస్థమైన నంబరు ప్లేట్లు గుర్తించి, ఆయా నంబరు ప్లేట్లు తయారు చేయించి, ఆయా వాహనాలకు తిరిగి అమర్చారు. ఈ తనిఖీల్లో సుమారు 60 ద్విచక్ర వాహనాలకు అస్తవ్యస్థమైన నంబరు ప్లేట్లను తొలగించారు. ఎంవి నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు ఈ-చలానాలను విధించారు.

విద్యుత్తు కోతలతో ఉపాధికి ఎసరు

వృత్తిదారులు, చిరు వ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు

అటు విద్యుత్ ఛార్జీల వాతలు.. ఇటు విద్యుత్ కోతలతో ప్రజలు, వృత్తిదారులు, మెకానిక్‌లు, చిరు వ్యాపారులు, వెల్డర్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి తగ్గట్టు సరఫరా లేకపోవడంతో అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా విద్యుత్ కోతలు విధించడంతో అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ కోతలతో దోమలు బెడద, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవ్వగా పనులు ముందుకు సాగకపోవడంతో వృత్తిదారులు, జీవనోపాధి కోల్పోతున్నారు. నెల రోజుల నుంచి విద్యుత్ కోతలు ఉండడంతో నష్టాల పాలవుతున్నారు.



విద్యుత్తు లేక ఖాళీగా ఉన్న వెల్డింగ్ షాపు



విద్యుత్తు కోతలతో మూసివేసిన మోటార్ మెకానిక్ షాపు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి సబ్ డివిజన్ పరిధిలో బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం దత్తిరేజేరు, గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ, మెంటాడ మండలాల్లో గృహ వినియోగ విద్యుత్ కనెక్షన్లు లక్షా 56వేల 639, వాణిజ్య కనెక్షన్లు 12,244, పరిశ్రమల కనెక్షన్లు 611, హెచ్‌టి కనెక్షన్లు 63, వీధి దీపాలు, ఆలయాలు (కేటగిరీ-4) కనెక్షన్లు 2,792, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 4528 ఉన్నాయి. విద్యుత్ కోతలు విధించడంతో దోమల బెడదతో పాటు ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయాల్లో విద్యుత్ కోతలతో నిద్రలు లేక గ్రామాల్లో ప్రజలు ఆరు బయట నిద్రించే పరిస్థితి దాపురించింది.

ఉపాధి కోల్పోతున్న వృత్తిదారులు

వేళాపాలా లేని విద్యుత్ కోతలతో ఉపాధి కోల్పోతున్నామని కార్పెంటర్లు, వెల్డర్లు, మెకానిక్‌లు క్షౌర వత్తిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్ర పని చేయాలంటే విద్యుత్ అవసరమని, విద్యుత్ కోతలతో పనులు సక్రమంగా జరగడం లేదని వాపోతున్నారు. బార్బర్ షాపులపై కూడా విద్యుత్ కోతల ప్రభావం బాగా పడుతుందని నాయీబ్రాహ్మణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కోతలతో పనుల్లేక కుటుంబ పోషణ కష్టంగా మారుతుందని వాపోతున్నారు.

మరోవైపు విద్యుత్ కోతల ప్రభావం జిరాక్స్, పాన్ షాప్, ఫ్రూట్ జ్యూస్ వ్యాపారులపై తీవ్రంగా పడుతుంది. విద్యుత్ కోతలతో వెల్డింగ్ షాపులు కూడా మూత పడుతున్నాయి. విద్యుత్ లేకపోవడంతో ఫ్రిజ్ లు, జిరాక్స్ మిషన్లు, కంప్యూటర్లు పని చేయడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. దీంతో వ్యాపారం అవ్వకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారుతుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో పనులను పూర్తి చేయలేకపోతున్నాం



విద్యుత్ కోతలతో సకాలంలో పనులను పూర్తి చేయలేకపోతున్నాం. సకాలంలో కస్టమర్లకు గేట్లు, కిటికీలు, ఇతర సామగ్రి డెలివరీ చేయలేకపోవడంతో కొత్తగా ఆర్డర్లు రావడం లేదు.విద్యుత్ కోతలు నివారిస్తేనే వెల్డింగ్ షాపులకు మనుగడ ఉంటుంది.

- మర్రాపు పోలినాయుడు,
వెల్డింగ్ షాపు యజమాని, బొబ్బిలి

దోమలతో ఇబ్బందులు పడుతున్నాం



విద్యుత్ కోతలతో దోమలు బెడద అధికంగా ఉంది. దోమలు కాటు వేయడంతో అనారోగ్యం బారిన పడుతున్నాం. రాత్రి, పగలు తేడా లేకుండా విద్యుత్ కోతలు విధించడం సరికాదు. ఓ వైపు విద్యుత్తు బిల్లుల మోత మోగిస్తున్నారు. మరోవైపు కరెంటు ఇవ్వడం లేదు.

- యు.ప్రసాద్, రంగరాయపురం

విద్యుత్తు కోతల నివారణకు చర్యలు



విద్యుత్ కోతలు నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. వాతావరణంలో మార్పులు రావడంతో విద్యుత్ వినియోగం పెరిగింది. పెరిగిన డిమాండ్‌కు తగ్గట్టుగా ఉత్పత్తి లేకపోవడంతో కోతలు విధించాల్సి వస్తోంది. ప్రజలు ఇబ్బందులు పడకుండా విద్యుత్ కోతలు నివారణకు చర్యలు తీసుకుంటాం.

- పూడి హరి,
విద్యుత్తు శాఖ ఇఇ, బొబ్బిలి

స్కూల్ గేమ్స్‌కు గ్రీన్‌సిగ్నల్

అక్టోబర్ 15 వరకు నిర్వహణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్కూల్ గేమ్స్ పోటీలకు విద్యా శాఖ పచ్చ జెండా ఊపింది. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ,ప్రైవేటు విద్యా సంస్థల్లో పాఠశాల స్థాయిలో క్రీడా పోటీలకు రంగం సిద్ధమైంది. శనివారం జిల్లా విద్యా శాఖ అధికారి బి.లింగేశ్వర రెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్ వి రమణతో క్రీడా పోటీలపై సమావేశం నిర్వహించారు. విజయనగరం జిల్లా లో గల మండల స్పోర్ట్స్, గేమ్స్ కోఆర్డినేటరులు, నియోజక వర్గ స్పోర్ట్స్ గేమ్స్ కోఆర్డినేటరులుగా ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులు అందరూ స్కూల్ ఎడ్యుకేషన్ వారి ఆదేశాలు మేరకు అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈనెల 1 నుండి 10 వరకు మండల స్థాయి క్రీడలకు ఎంపికలు చేపట్టాలని తెలిపారు. 11 నుంచి 20 వరకు నియోజకవర్గ స్థాయి క్రీడలకు, 21 నుంచి అక్టోబర్ 15వరకు జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికలు నిర్వహించాలని తెలిపారు. మండల, నియోజక వర్గ స్థాయిలో 9 క్రీడలు (కబడ్డీ , ఖోఖో , వాలీబాల్ , బాల్ బ్యాడ్మింటన్ , బాడ్మింటన్ , త్రో బాల్ , టెన్నికాయిట్, యోగ అథ్లెటిక్స్) కు సంబంధించి సెలెక్షన్స్ నిర్వహించాలని తెలిపారు. మిగిలిన క్రీడలకు సంబంధించిన సెలెక్షన్స్ జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడా ఎంపికలు ,పోటీలు విజయవంతంగా నిర్వహించాలని, ప్రతిభ కనబర్చిన విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని తెలిపారు.



భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న గుమ్మడి సంధ్యారాణి

కరెంటు కోతలతో నరకం

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సంధ్యారాణి

ప్రజాశక్తి-మెంటాడ

అప్రకటిత కరెంటు కోతలతో ప్రజలు నరకం అనుభవిస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి తెలిపారు. శనివారం మండలంలోని ఆంద్ర గ్రామంలో బాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎనిమిది సార్లు విద్యుత్తు ఛార్జీలు పెంచిన ఏకైక ప్రభుత్వం వైసిపి సర్కారేనని ఎద్దేవాచేశారు. టిడిపి హయాంలో ఎపిలో లోటు విద్యుత్తు నుంచి మిగులు విద్యుత్తు రాష్ట్రంగా చంద్రబాబునాయుడు మార్చారని, వైసిపి గద్దెనెక్కాక మళ్లీ కరెంటు కోతలు మొదలయ్యాయని విమర్శించారు. రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్తు ఇస్తానని హామీ ఇచ్చిన జగన్ రెడ్డి అమలు చేయడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు.

కార్యక్రమంలో టిడిపి నాయకులు చలుమూరి వెంకటరావు, జి.అన్నవరం, రెడ్డి ఎర్నాయుడు, కాశీవిశ్వనాథం, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న గణపతిరావు

ప్రజాశక్తి-రాజాం

రాజాం మున్సిపాలిటీలో వివిధ నిదులతో చేపడుతున్న అభివృద్ధి పనులు ప్రజారోగ్య సాంకేతికశాఖ ఇంజినీర్ (విశాఖపట్నం) పి.గణపతిరావు శనివారం పరిశీలించారు. రేగిడి హెడ్ వాటర్ వర్క్సును పరిశీలించారు. అనంతరం మున్సిపాలిటీలో అర్బన్ హెల్త్ క్లినిక్ పనులు , జగనన్న కాలనీలో వాటర్ సప్లై పనులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతూ అభివృద్ధి పనుల టెండర్లను త్వరితగతిన పిలిచి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయనతో టెక్నికల్ ఆఫీసర్ కె.ఫణి కుమార్, సహాయక ఇంజనీర్ వెంకట్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.



ఆదిత్య ఎల్-1 ఆకారంలో విద్యార్థులు

ఆదిత్య ఎల్-1 ప్రయోగంపై హర్షం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పిఎస్‌ఎల్‌విసి 57 ద్వారా సూర్యుడిపై ప్రయోగాలకు ఆదిత్య ఎల్-1 విజయవంతంగా ప్రయోగించడంపై ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా శనివారం విద్యార్థులు ఆదిత్య ఎల్-1 ఆకారంలో కూర్చొని, జాతీయ జెండాను ప్రదర్శిస్తూ తమ సంతోషాన్ని వ్యక్తంచేశారు. ఆదిత్య ఎల్-1 ప్రయోగాన్ని లైవ్‌ప్రోగ్రాం ద్వారా విద్యార్థులు వీక్షించారు. ప్రయోగం విజయవంతం కావడంతో విద్యార్థులు జయహో భారత్, ఆల్ ది బెస్ట్ ఆదిత్య ఎల్-1.. తదితర నినాదాలతో, చప్పట్లతో హోరెత్తించారు.

విద్యుత్తు భారాలను రద్దుచేయాలి

సిపిఎం ఆధ్వర్యాన కరెంటు బిల్లులు దగ్ధం



విజయనగరంలో కరెంటు బిల్లులను దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రజలపై ట్రూ అప్ ఛార్జీల పేరుతో 6వేల కోట్ల రూపాయల విద్యుత్ చార్జీలు భారాలు వేశారని, తక్షణమే వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శనివారం ఆర్‌డిఒ కార్యాలయం పక్కనగల సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్తు బిల్లులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలు ఫలితంగా ధరలు రోజు రోజుకూ పెరుగుతూ పేద మధ్యతరగతి ప్రజానీకానికి ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. ఇప్పటికే ప్రజలు పెరిగిన ధరలతో శతమతమవుతుంటే ఇవి చాలదన్నట్లు మూలుగుతున్న నక్క పైన తాటిపండు పడినట్లు విద్యుత్ ఛార్జీలను పెంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల నడ్డి విరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కావున పెరిగినధరలు తగ్గించాలని కోరుతూ సిపిఎం సమర భేరి కార్య క్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం దిగిరాక పోతే ప్రజలే ప్రభుత్వాన్ని దించేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, బి.రమణ, కంది త్రినాథ్, కానూరు రమణ, శేఖర్,గోపి, తది తరులు పాల్గొన్నారు. **నెల్లిమర్ల** నగర పంచాయతీలో గాంధీనగర్ సచివాలయ కార్యదర్శికి సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు ఆధ్వర్యాన వినతి అందించారు. కార్యక్రమంలో నాయకులు కె.సూర్య నారాయణమూర్తి ఉన్నారు. **శృంగవరపుకోట** మండలంలోని కొత్తూరు, వెంకటరమణపేట సచివాలయాల వద్ద సిపిఎం ఆధ్వర్యాన విద్యుత్తు బిల్లులు దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ, చెలికాని ముత్యాలు, ఎర్రాప్రగడ భాస్కరరావు, గోకల భాస్కరరావు, తౌత్తడి భారతి, మద్దిల ముత్యాలమ్మ, టి.దేవి, పి.భాస్కరరావు, మంచిన రమణ, తదితరులు పాల్గొన్నారు. **గజపతినగరం** మండలంలోని జిన్నాం గ్రామంలో సిపిఎం ఆధ్వర్యాన సంతకాలు సేకరించి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి శ్రీనివాస్, గౌరీ, లక్ష్మణ, అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు. **లక్కవరపుకోట** మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్తు బిల్లులను దగ్ధం చేశారు. తౌలుత మండల కేంద్రం నుండి రైతు భరోసా కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు, నాయకులు తరిణి వెంకటరమణ, ఆర్.రామునాయుడు పాల్గొన్నారు. **బొబ్బిలి రూరల్** మండలంలోని రంగరాయపురం సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. విద్యుత్తు బిల్లులు దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, మండల నాయకులు యు.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



గజపతినగరంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, ప్రజలు



లక్కవరపుకోటలో కరెంటు బిల్లులను దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు

ఉద్యోగం వచ్చిన మూడు నెలలకే..

అదే రైలు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- భోగాపురం(డెంకాడ)

రైల్వేలో మెకానిక్‌గా కొడుక్కి ఉద్యోగం రావడంతో ఆ తల్లి ఎంతో సంతోషించింది. కుటుంబానికి అండగా నిలుస్తాడని భావించింది. తమిళనాడులో ఉద్యోగానికి వెళ్లి మూడు నెలలు అయింది. ఇంతలో రైలు ప్రమాదంలో ప్రమాదవశాత్తూ చనిపోయాడనే సమాచారంతో ఇంతలోనే ఆ తల్లి ఆశలు ఆవిరి అయిపోయాయి. ఈ విషాదకరమైన సంఘటన తెలియడంతో కుటుంబ సభ్యులతోపాటు భోగాపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

భోగాపురం గ్రామానికి చెందిన ప్రగడ రవణ, దానమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. ఇందులో చిన్న కుమారుడు ప్రగడ అప్పలరాజు (29). ఎనిమిదేళ్ల కిందట తండ్రి రవణ చనిపోయినప్పటికీ తల్లి చదివించి ప్రయోజకుడిని చేయాలని అనుకుంది. అప్పలరాజు కూడా అదే విధంగా చదువులో బాగా రాణించేవాడు. మూడు నెలల కిందట రైల్వేలో మెకానిక్‌గా ఉద్యోగం సాధించాడు. దీంతో తల్లితోపాటు కుటుంబ సభ్యులందరూ ఎంతో సంతోషించారు. తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్ సమీపంలోని లోకో షెడ్‌లో మూడు నెలల కిందట వెళ్లి విధులు నిర్వహిస్తున్నాడు. ఎప్పటివలె గురువారం ఉదయం 5 గంటల ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నాడు. రైలుభోగి కింద తోటి ఉద్యోగితో కలిసి మరమ్మతులు చేస్తున్నాడు. అయితే ఏమైందో తెలియదు కానీ రైలు కదలడంతో పట్టాల మధ్య ఇరుక్కుపోయాడు. రైలు పైనుంచి వెళ్లిపోవడంతో శరీరం రెండు ముక్కలైంది. అప్పలరాజు అక్కడకక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే అధికారులు భోగాపురంలో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన తల్లితోపాటు అక్క, అన్నయ్య కుటుంబ సభ్యులంతా విషాదంలో మునిగారు. మృతదేహాన్ని భోగాపురం తీసుకొచ్చేందుకు కుటుంబ సభ్యులు తమిళనాడు వెళ్లారు.



ముక్కలైన శరీరం

ఈ తిప్పలు ఎన్నాళ్లో?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'వర్షం నిలకడగా కురవడం లేదు. కురిసినా నీరు నిలబడడం లేదు. అష్టకష్టాలతో ఒడిసిపట్టిన వర్షపునీటితో ఉబాలు పట్టి అతికష్టం మీద నాట్లు వేసినా నాట్లు వేసినా వాటిని బతికించుకునేందుకు నానా తంటాలు పడాల్సివస్తోంది.' ఇదీ జిల్లాలో మెజార్టీ ప్రజానీకం, ముఖ్యంగా రైతు కుటుంబాల నోట వినిపిస్తున్న మాట. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైనంత వర్షం కురిసినట్టుగా అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. అంత వర్షం కురవలేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కురిసిన కాస్తంత వర్షాలకు తగ్గట్టు ఎండలు కూడా మండిపోతుండడంతో చెరువులు నిండలేదు. జలాశయాల్లోనూ సామర్థ్యానికి తగ్గట్టు నీరు లేదు. దీంతో, లక్ష్యానికి తగ్గట్టు వరి నాట్లు పడలేదు. జిల్లాలో సాధారణంగా జూన్ చివరి నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావాల్సి ఉంది. గత కొన్నాళ్ల నుంచి రుతుపవనాలు ఆలస్యం కావడంతో జులై ఒకటి లేదా రెండో వారంలోనైనా నారు పోతలు మొదలయ్యేవి. ఈ ఏడాది అందుకనుగుణంగా వర్షాలు కురవడంతో వరినారు పోతలు, ఇతర పంటల సాగు ఒకింత ఉత్సాహంగానే మొదలైంది. జులై చివరి వారం నుంచీ పెద్దగా వర్షాలు లేకపోవడంతో అనుకున్న స్థాయిలో నాట్లు వేసేందుకు అవకాశం లేకుండా పోయింది. ఎదిగిన వరినారును ముందు పెట్టుకుని వరుణుడి కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రధాన పంట వరి. ఖరీఫ్ సీజన్‌లో 2,25,637 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,28,750 ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి. గత ఏడాది ఇదే సరిగ్గా సమయానికి 1,77,500 ఎకరాల్లో నాట్లు పడ్డాయి.



మొక్కజొన్న గత ఏడాది ఇదే సమయానికి సుమారు 30,500 ఎకరాల్లో సాగవ్వగా, ప్రస్తుతం 20,910 ఎకరాల్లో మాత్రమే సాగైంది. పత్తి గతేడాది 5వేల ఎకరాలు సాగు కాగా, ప్రస్తుతం 3,127 ఎకరాలకు మించి సాగవ్వలేదు. చెరకు, వేరుశనగ, నువ్వులు, ఇతర అపరాలు తదితర పంటలన్నింటి సాగులోనూ ఇదే రకమైన వెనుకబాటు కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో అన్ని పంటలు కలుపుకుని 3,17,052 ఎకరాల మేర సాగు విస్తీర్ణం కాగా, గత ఏడాది ఇదే సమయానికి 2,39,903 ఎకరాల్లో సాగు కనిపించింది. ఈ ఏడాది కేవం 1,85,755 ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. ఈనేపథ్యంలో దశాబ్దాల తరబడి పాలకుల నిర్లక్ష్యాన్ని చాలా మంది రైతులు గుర్తుచేస్తున్నారు. వాస్తవానికి మన జిల్లాలో సాగునీటి వనరులకు కొదవలేదు. అందుకు తగ్గట్టే వర్షపాతం కూడా నమోదవుతోంది. అధికారిక లెక్కల ప్రకారం సాధారణ వర్షపాతం కన్నా 5 మిల్లీ మీటర్ల వర్షం అధికంగా కురిసింది. కానీ, ఈ నీరు చెరువులు, జలాశయాల్లోకి చేరేందుకు అనుగుణంగా కాలువలు లేవు. దీంతో, కొంతమేరకు వర్షపునీరు నదుల ద్వారా సముద్రం పాలవుతోంది. మరోవైపు ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోవడం వల్ల ఎండకు ఆవిరైపోతోంది. ఈ నేపథ్యంలో పాలకుల నిర్లక్ష్యం వల్లే ఏటా ఉబాలు ఆలస్యం అవుతున్నాయని, దీనివల్ల దిగుబడి కూడా సరిగా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం

అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం మండల స్థాయి అధికారులతో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చిన ప్రతి సమస్య వెంటనే పరిష్కరించాలన్నారు. సెప్టెంబర్ పదో తేదీలోగా జగనన్న గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ భవనాల పనులు పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

తంగుడుబిల్లిలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని తంగుడుబిల్లిలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యాన భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బంగార్రాజు ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికలలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును ఆశీర్వదించాలని కోరారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, భోగాపురం, నెల్లిమర్ల మండలాల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, కడగల ఆనంద్‌కుమార్, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, నాయకులు గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, పోతల రాజప్పన్న, అవనాపు సత్య నారాయణ, గురాన చక్రధర్, తంగుడుబిల్లి ఎంపిటిసి చందక చిన్నం నాయుడు పాల్గొన్నారు.



పింఛన్లను అందజేస్తున్న ఎంపిపి శ్రీనివాసరావు

26 మందికి పింఛన్లు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని చందులూరులో కొత్తగా 26 మందికి సచివాలయంలో ఎంపిపి గేదెల శ్రీనివాసరావు శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపిటిసి యడ్ల కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపిపి మాట్లాడుతూ కొత్తగా గీత కార్మికులకు 3, వికలాంగులకు 6, వితంతువులకు 13, వృద్ధాప్య పింఛన్లు 4 మంజూరైనట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ యడ్ల సింహాచలం, మాజీ సర్పంచ్ యడ్ల సత్యారావు, రేగ, లచ్చంపేట ఎంపిటిసిలు బొడ్డు గణపతి, స్వామినాయుడు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : మండలంలోని బొడ్డవరలో కొత్తగా మంజూరైన 27 పింఛన్లను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, వైస్ ఎంపిపి సుధారాణి పంపిణీ చేశారు. సర్పంచ్ డి.మీనాకుమారి, నాయకులు మురళీరాజు, సన్యాసిదేముడు, కేతా వీరన్న పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల సందర్శన

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని కొత్తవలస, కాలంరాజుపేట, చిన్నపాలవలస, పెద్ద పాలవలస అంగన్వాడీ కేంద్రాలను సిడిపిఒ రాజ్యలక్ష్మి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రీస్కూల్ పిల్లల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లు సక్రమంగా అందుతున్నాయా? లేదా అని ఆరాతీశారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఉషారాణి పాల్గొన్నారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

క్రీడా పోటీల విజయవంతానికి వ్యాయామ ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఇఒ తిరుమల ప్రసాద్ కోరారు. స్థానిక ఎంఆర్‌సిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరికతోట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఈ నెల 8న క్రీడా పోటీలు, ఎంపికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల విద్యార్థుల గెలుపునకు మంచి తర్ఫీదు ఇచ్చి ప్రతిష్ట తేవాలని కోరారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

అనాథ యువతి వివాహానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఆతవ గ్రామానికి చెందిన బోని లక్ష్మి తల్లిదండ్రులు మరణించారు. ఆమె వివాహ నిమిత్తం టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యాన ఆ పార్టీ నాయకులు ఆర్థిక సాయం చేశారు. గొంప కృష్ణ రూ.5 వేలు, నాయకులు సిరికి రమణ రూ.5 వేలు, ఎం.లక్ష్మణ రూ.3వేలతోపాటు మరికొంతమంది కలిసి అందజేసిన మొత్తం రూ.20 వేలను ఆ గ్రామ నాయకులు లక్ష్మికి శనివారం అందించారు.

గారమ్మకాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని గారమ్మ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. తిరుపతిరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన పాలకొండలో సిపిఎం మండల కన్వీనర్ డి. రమణారావు, కాద రాముతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలకొండ నగర పంచాయతీ ప్రజల నుండి భారీగా పన్నులు వసూలు చేసే శ్రద్ధ మౌలిక సదుపాయాలు కల్పించడంలో మున్సిపల్ అధికారులు, పాలకవర్గం వైఫల్యం చెందిందన్నారు.

గ్రోమోర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

రైతులకు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న గ్రోమోర్‌పై చర్యలు తీసుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి డిమాండ్ చేశారు. రైతులు ఎరువులు కొనుగోలు నిమిత్తం షాప్‌కు వెళ్తే ఒక ఎరువు కుంటే వేరేది తీసుకువెళ్లాలని అంటగడుతున్నారన్నారు. అంతేకాకుం డా ఉన్న ఎరువులు బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తు న్నారని విమర్శించారు. రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు అందజేస్తామని చెబుతున్న అధికారులు ఎక్కడా సక్రంగా రైతులకు ఎరువులు అందడం లేదన్నారు. తక్షణమే గ్రోమోర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు.

పేదల గుండెల్లో వైఎస్ఆర్ పదిలం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



బొబ్బిలి.. వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి పేదల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన నగరంలోని సిఎంఆర్ కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో అందిస్తూ సువర్ణ పరిపాలనకు వైఎస్ నాంది పలికారని గుర్తు చేశారు. సుపరిపాలనతో ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేశారని అన్నారు. పేద విద్యార్థులూ ఉన్నత చదువులు చదివి, నేడు మంచి స్థాయిలో ఉన్నారంటే అది వైఎస్ వల్లేనని.. ఆరోగ్యశ్రీ పథకానికి రూపకల్పన చేసి ఎంతోమంది ప్రాణాలను కాపాడారని చెప్పారు. వైఎస్సార్ ఆశయ సాధన లక్ష్యంగా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. అవినీతిపై పోరాటం చేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు అంటున్నారని.. అసలు రాష్ట్రంలో అవినీతి ఎక్కడ జరుగుతోందని కోలగట్ల ప్రశ్నించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే సేవలు అందిస్తున్నామని చెప్పారు. అనంతరం నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లను ఈ సందర్భంగా అందజేశారు. ఎక్కడైనా కొంతమంది మహిళలు ఒక్కటై ఉపాధి కోసం కుట్టు మిషన్లు కావాలనుకుంటే తాము అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కొత్తవలస** మండలంలోని దేశపాత్రునిపాలెంలో ఉన్న పైలాన్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.25 లక్షల చెక్కులను 33 మందికి ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎఎంసి చైర్‌పర్సన్ మూకల కస్తూరి, ఎంపిపిలు నీలంశెట్టి గోపమ్మ, సత్యవంతుడు, జి.శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌ఛార్జి ఎం.సత్యనారాయణ, వైస్ ఎంపిపిలు కర్రి శ్రీనివాసరావు, సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, పిఎస్ఎన్ పాత్రుడు, శెట్టి అనిల్‌కుమార్ పాల్గొన్నారు. **బొబ్బిలి** పట్టణంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, మహిళలకు చీరలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. గొల్లపల్లిలో వైఎస్ఆర్ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మి, వేణుగోపాలనాయుడు, వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, బుడా చైర్మన్ ఇంటి పార్వతి, గోపాలరావు, జెడ్‌పిటిసి సంకిలి శాంతకుమారి, మండల, పట్టణ జెసిఎస్ కన్వీనర్లు తమ్మిరెడ్డి దామోదర్, రేజేటి ఈశ్వరరావు, ముస్లిం మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ హమీద్ పాల్గొన్నారు. **వేపాడ** మండల కేంద్రంలో వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి సత్యవంతుడు, జెడ్‌పిటిసి ఎస్.అప్పలనాయుడు, వైస్ ఎంపిపి ఈశ్వరరావు, మండల అధ్యక్షులు ఎం.జగ్గుబాబు నివాళులర్పించారు. **డెంకాడ** మండలంలో వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు నివాళులర్పించారు. పిహెచ్‌సిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, జెసిఎస్ చైర్మన్ గౌరీశంకర్ పాల్గొన్నారు. భోగాపురం మండలం రెడ్డికకంచేరులో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ నివాళు లర్పించారు. అనంతరం జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ మంచినీటి



కొత్తవలస.. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

కొళాయిలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బైరెడ్డి రమణ, జెసిఎస్ మండల కన్వీనర్ బైరెడ్డి యరప్పలనారాయణరెడ్డి, రాష్ట్ర మత్స్యకార డైరెక్టర్ నరసింహులు, దల్లి బంగారిరెడ్డి పాల్గొన్నారు. **బొండపల్లి** మండల కేంద్రంలోని బజార్ జంక్షన్‌లో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఎంపిపి చల్ల చలంనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు బివి.ప్రభుజీ, మహంతి రమణ, గొల్లు సతీష్, మాజీ ఎంపిపి బండారు బంగారం, సర్పంచులు బొండపల్లి ఈశ్వరరావు, కర్రోతు శ్రీనివాసరావు, మునకాల పైడినాయుడు, సిరిపురపు ఆదినారాయణ, ఎం.నారాయణమూర్తిరాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తాళ్లపూడి కృష్ణ నివాళులర్పించారు. **జామి** మండల కేంద్రంలో రావిచెట్టు వీధిలో వైసిపి మండల కన్వీనర్ రవికుమార్ ఆధ్వర్యాన వైఎస్ఆర్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ పి.సంజీవి, వైసిపి ప్రచార కమిటీ అధ్యక్షులు గుడివాడ రాజేశ్వరరావు, ఎంపిపి అరుణ, సర్పంచ్ చిప్పాడ లక్ష్మి పాల్గొన్నారు. **గుర్ల** మండలంలో కెల్ల జంక్షన్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సీర అప్పలనాయుడు, డిఎల్‌డిఎ చైర్మన్ బెల్లాన బంగారునాయుడు, పొట్నూరు సన్యాసినాయుడు పాల్గొన్నారు. **లక్కవరపుకోట** మండలంలోని చందులూరులో ఎంపిటిసి యడ్ల కిశోర్‌కుమార్, సర్పంచ్ యడ్ల సింహాచలం ఆధ్వర్యంలో ఎంపిపి గేదెల శ్రీనివాసరావు.. వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో చందులూరు మాజీ సర్పంచ్ యడ్ల సత్యారావు, రేగ , లచ్చింపేట ఎంపిటిసిలు బొడ్డు గణపతి, స్వామినాయుడు పాల్గొన్నారు. **శృంగవరపుకోట** పట్టణంలోని దేవిబొమ్మ కూడలిలో వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నివాళులర్పించారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్సీ రఘురాజు




విజయనగరంటౌన్.. వైఎస్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

కూడా నివాళులర్పించారు. **నెల్లిమర్ల** మండలంలో వైఎస్ఆర్ విగ్రహాలకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేశ్‌బాబు నివాళులర్పించారు. ఏడో వార్డులో కౌన్సిలర్ మైపాడ సొంత నిధులతో నిర్మించిన మంచినీటి ట్యాంకును వారు ప్రారంభించారు. పింఛన్లు, పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్ల వెంకటరమణ, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, మొయిద శ్రీను, నాయకులు మద్దిల వాసు, డి.గిరి బాబు, జనా ప్రసాద్, గంటా సతీష్, బూర సత్తి బాబు, తదితరులు పాల్గొన్నారు. జరజాపుపేటలో వైఎస్ఆర్ విగ్రహానికి వైస్ చైర్మన్ సముద్రపు రామారావు నివాళులర్పించారు. కార్యక్రమంలో స్టేట్ డైరెక్టర్ మద్దిల వాసు, నల్లి శ్రీను, తుమ్ము నారాయణమూర్తి, పాండ్రంకి సత్యనారాయణ, పి.నారాయణమూర్తి పాల్గొన్నారు.

రాజశేఖర్ రెడ్డి సేవలు ఎనలేనివి

విజయనగరం కోట : మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలు ఎనలేనివని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ కొనియాడారు. శనివారం రాజశేఖర్ రెడ్డి 14వ వర్ధంతి పురస్కరించుకొని స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనమైన నివాళులర్పించారు ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ఉంటూ ఆంధ్ర ప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపించారని కొనియాడారు. రాజీవ్ గృహ కల్ప, ఆరోగ్యశ్రీ వంటి అనేక పథకాలు పెట్టి ప్రజలకు ఎంతో మేలు చేశారని అన్నారు. పట్టణ అధ్యక్షులు సుంకర సతీష్, డెంకాడ మండలం నుంచి కంది చంద్రశేఖర్, సూరిబాబు, గురువులు అబ్దుల్, సూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ.. వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు ఉప్పాడ



వేపాడ.. వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపిపి సత్యవంతుడు

జన సైన్యం ఐక్యంగా పోరాడాలి

మాజీ మంత్రి పడాల అరుణ



మెంటాడ.. రక్తదానం చేస్తున్న పవన్ అభిమానులు

ప్రజాశక్తి-మెంటాడ

జనసైన్యం కలిసికట్టుగా పోరాడి, ప్రజాసేవలో మమేకం అవ్వాలని మాజీ మంత్రి, జనసేన నాయకురాలు పడాల అరుణ అన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మెంటాడలో 50 మంది యువత రక్తదానం చేశారు. రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. గ్రామంలో మొక్కలు నాటారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన జనసైనికుడు కె.సత్యనారాయణకు రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు. పేద విద్యార్థులు ఎం.రాజేష్, డి.సునీతను మెంటాడ వారియర్స్ ఫౌండేషన్ దత్తత తీసుకుంది. **జామి** మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద జనసేన మండల నాయకులు వర్మారాజు ఆధ్వర్యంలో న్యాయవాది బూసర్ల రమణారావు కేక్ కట్ చేశారు. మజ్జిగ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలో భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. **లక్కవరపుకోట** మండలంలోని జనసైనికులు 45 మంది రక్తదానం చేశారు. రోడ్లకు ఇరువైపులా సుమారు 200 మొక్కలను నాటారు. అనంతరం పేదలకు దుప్పట్లు, ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసైనికులు షేక్ ఫిరోజ్, రావాడ నాయుడు, అలమండ రాంబాబు పాల్గొన్నారు. **బొబ్బిలి** పట్టణంలోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి కేక్ కట్ చేశారు. మెట్టవలస పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. గొర్లెసీతారాంపురంలో వెంకటేశ్వర ఆలయంలో పూజలు చేశారు. జనసైనికులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి పాల్గొన్నారు. **గరివిడి** పట్టణంలో జనసేన నాయకులు బి.సంతోష్ ఆధ్వర్యంలో శనివారం దుమ్మెదలో మెగా రక్తదాన శిబిరం ఎర్పాటు చేశారు. **శృంగవరపుకోట** మండలంలోని జనసేన నాయకుల ఆధ్వర్యాన మూడు చోట్ల రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయగా, 105 మంది రక్తదానం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వబ్బిన సత్యనారాయణ, సన్యాసినాయుడు పాల్గొన్నారు. **విజయనగరం టౌన్..** నగరంలో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను జనసేన నాయకులు గురాన అయ్యలు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కోట జంక్షన్ వద్ద భవన నిర్మాణ కార్మికులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం గాజులరేగ, గంజిపేట, దుప్పాడ ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. నరవ గ్రామంలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో పలువురు రక్తదాన దానం చేశారు. అనంతరం హుకుంపేటలో జన్మదిన వేడుకలు నిర్వహించి జనసేన కిట్లు పంపిణీ చేశారు.లంకాపట్నంలో చీరలు పంపిణీ చేశారు. అనంతరం హోటల్ జిఎస్ఆర్ వద్ద భారీ అన్నదానం చేపట్టారు. జనసేన కార్యకర్తల ఆధ్వర్యంలో బర్త్ డే కేక్‌ని అయ్యలు కట్ చేశారు. గుర్ల మండలం కెల్ల గ్రామంలో వాలీబాల్ పోటీలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.



బొబ్బిలి.. పాలూరి బాబుకు కేకు తినిపిస్తున్న కార్యకర్తలు

ఆకిరిని సస్పెండ్ చేస్తే ఊరుకోం

టిడిపి సర్పంచులు, ఎంపిటిసిల ఆగ్రహం





సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు దల్లి ముత్యాలరెడ్డి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పార్టీకి అహర్నిశలు సేవలందించిన జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఆకిరి ప్రసాదరావును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే ఊరుకోబోమని పలువురు టిడిపి సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని కొప్పెర్లలో మాజీ జెడ్‌పిటిసి ఆకిరి ప్రసాదరావు తన గృహం వద్ద సమావేశం వేర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆకిరి ప్రసాదరావు మాట్లాడుతూ తనను పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ మండలం నుండి కొంత మంది పెద్దలు తీర్మానించి, పార్టీ కార్యాలయానికి పంపారన్నారు. పార్టీ నుండి సస్పెండ్ చేయాల్సినంత పని ఏం చేశానో ఆ పెద్దలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటీవల మండలంలో జరిగే సమావేశాలకు తనకు సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్త చేశారు. ఈ తతంగమంతా మీ ముందు ఉంచేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశానన్నారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు దల్లి ముత్యాలరెడ్డి మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో ప్రసాదరావు నామినేషన్ వేయకపోవడం వల్లే సస్పెండ్ చేయాలని అనుకుంటే.. పెద్దలను ఎన్ని సార్లు సస్పెండ్ చేయాలో తెలుసుకోవాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సింహాచలం మాట్లాడుతూ తప్పు చేస్తే షోకాజ్ నోటీసు ఇవ్వాలే తప్ప చేతిలో పవర్ ఉందని సస్పెండ్ చేయడం మంచి పద్ధతి కాదని హితవుపలికారు. రెల్లివలస సర్పంచ్ భర్త ఈశ్వర్రావు మాట్లాడుతూ 40 ఏళ్ల రాజకీయంలో నేర్చుకున్నది ఇదేనా? అని ప్రశ్నించారు. కనిమెట్ట నాయకులు గోవిందరావు మాట్లాడుతూ ఏం తప్పు జరిగిందని సస్పెన్స్ దాకా వెళ్లిపోయారని నిలదీశారు. పూసపాటిరేగ, వెంపడాం, గుంపాం మాజీ సర్పంచులు పి. సన్యాసినాయుడు, పి. శ్రీనివాసరావు, కె.వెంకటరమణ తదితరులు మాట్లాడుతూ కొప్పెర్ల ఉప ఎన్నికల్లో ఆకిరి పోటీ చేసి ఉంటే బాగుండేదని అందరం అనుకున్నామని, అయితే ఏ పరిస్థితుల్లో పోటీ చేయలేకపోయారో అధిష్టానానికి చెపితే బాగుండేదన్నారు. వెంటనే ఆకిరి ప్రసాదరావు, తన కుమారుడు జగదీష్ స్పందించి కొప్పెర్ల ఉప ఎన్నికకు సంబంధించిన అన్ని విషయాలు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామని, అయినా కావాలనే తమపై కక్ష కట్టి ఇటువంటి నిర్ణయాలు చేస్తున్నారని ఆరోపించారు. అందరం సమిష్టిగా రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించుకోవాలని, త్వరలోనే మరో సారి మండల కమిటీ కూర్చొని ఒకవేళ సస్పెండ్ చేస్తూ తీర్మానం పంపితే దాన్ని వెంటనే ఆపించే ప్రయత్నం చేస్తామని వారంతా ఆకిరికి తెలిపారు. ఈ సమస్యను ఇప్పటితో వదిలేయాలని, అందరం కలిసి కట్టుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో నడిపల్లి నాయకులు శ్రీనివాసరావు, ఎరుకొండ సర్పంచి అప్పలస్వామినాయుడు, బత్తివలస సర్పంచి వెంకటప్పుడు, కొవ్వాడ , కనిమెట్ట, కనిమెల్ల నాయకులు సొంబాబు, అప్పలస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు



పింఛన్లపై ఆరా తీస్తున్న డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి

పింఛన్ల బట్వాడా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-రేగిడి

గ్రామ సచివాలయ పరిధిలో పింఛన్ల బట్వాడా వంద శాతం పూర్తి చేయాలని డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి అన్నారు. శనివారం రేగిడి, ఆమదాలవలస గ్రామాల్లో పింఛన్ల పంపిణీని ఆయన పరిశీలించారు.. ఆధార్ కార్డు ఆధారంగా వయస్సు నిర్ధారించారు. ఒకటి, రెండు తేదీల్లో పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నాగమణి పాల్గొన్నారు.

జాకేరులో..

వేపాడ : మండలంలోని జాకేరు గ్రామంలో పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులను ఇంటింటికి వెళ్లి ఎంఇఒ బాలభాస్కరరావు పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు బుద్దా అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి ప్రభుదాసు, వెల్ఫేర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-మెరకముడిదాం

మండలంలోని బైరిపురం రైతు భరోసా కేంద్రాన్ని పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.శారద తనిఖీ చేశారు. పలు రికార్డులను, మందులను పరిశీలించారు. అనంతరం అక్కడున్న రైతులతో మాట్లాడుతూ పశువులకు లంపీస్కిన్ వ్యాధి సంక్రమించకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేయించుకోవాలని తెలిపారు. రైతులకు అందు బాటులో ఉండి పశువులకు వైద్యం అందించేలా చూడాలని బైరిపురం పశు సంవర్ధక సహాయకురాలు వై. మణికి సూచించారు.

నాటుసారాపై అవగాహనకు ప్రచారరథం

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

మండలం పరిధిలో మోసూరు వలస గ్రామంలో నాటుసారా నివారణ గురించి 'ఆపరేషన్ పరివర్తన' అవగాహనా కార్యక్రమం ప్రచార రథం ద్వారా శనివారం ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు నాటుసారా తాగటం వలన కలిగే కష్ట, నష్టాలను వివరించారు. గ్రామస్తులంతా నాటుసారా వ్యాపారం మానుకొని కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఇబి ఎస్ఐ. చిన్నం నాయుడు, సిబ్బంది చంద్ర ప్రసాద్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఇబి సిఐ జైభీమ్